సాక్షి
గుంటూరు
బుధవారం ౹ 9 ౹ జూలై ౹ 2025



పేకాట స్థావరంపై దాడి


నగరం: వెలమవారిపాలెంలో పేకాట స్థావరంపై దాడిచేసి, 9 మందిని అదుపులోకి తీసుకుని, రూ.25,670లు స్వాధీనం చేసుకున్నామని రేపల్లె డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు తెలిపారు.



సమస్యల పరిష్కారంపై సమీక్ష

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో రెవెన్యూ సమస్యల పరిష్కారం లక్ష్యంగా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే కలెక్టరేట్‌లో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.

అభయాంజనేయుడికి ప్రత్యేక పూజలు



భట్టిప్రోలు: పెదపులివర్రు గ్రామ పంచాయతీ పరిధిలోని గాజులపేటలో కొలువైన అభయాంజనేయ స్వామి వారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఏఎన్‌ఎంల బదిలీల కౌన్సెలింగ్

గుంటూరు మెడికల్: గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో మంగళవారం ఏఎన్‌ఎంలకు సాధారణ బదిలీల కౌన్సెలింగ్ జరిగింది. నాలుగు రోజుల కిందట నిర్వహించిన కౌన్సెలింగ్‌పై పలు ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చాయి. దీంతో తిరిగి జూమ్ ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించారు. సుమారు 900 మందికి పైగా వార్డు సచివాలయ ఏఎన్‌ఎం గ్రేడ్-3 కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారు. ఈ ప్రక్రియ అర్ధరాత్రి వరకు కొనసాగింది.

సాగర్‌ను సందర్శించిన విదేశీయులు



విజయపురిసౌత్: పర్యావరణ పరిరక్షణ శిక్షణ, పరిశోధన సంస్థలో ఈ నెల 1వ తేదీ నుంచి 14 వరకు భారత ప్రభుత్వ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న 24 దేశాలకు చెందిన 37మంది మంగళవారం నాగార్జునసాగర్‌ను సందర్శించారు. పర్యావరణ, అభివృద్ధి, నీటి సంరక్షణ తదితర అంశాలలో శిక్షణ పొందుతున్న వీరు సాగర్ జలాశయం, మెయిన్ డ్యాం, జల విద్యుదుత్పాదన కేంద్రం తదితర ప్రాంతాలను సందర్శించారు. సాగర్ ప్రాజెక్టు నిర్మాణం, జలవనరుల వినియోగం తదితర అంశాల గురించి సాగనీటి శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని పర్యావరణ సంస్థ అధికారులు సమన్వయ పరిచారు. వీరి వెంట సాగునీటి శాఖ అధికారులతో పాటు తెలంగాణా పోలీసులు, డ్యాం ప్రత్యేక రక్షణ (ఎస్‌పీఎఫ్)దళం ఉన్నారు.

రెండవ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో పీజీ ఆర్ట్స్, సైన్స్, కామర్స్, ఎంబీఏ, ఎంసీఏ, ఎంపీఈడీ, బీపీఈడీ, బీఈడీ తదితర కోర్సుల రెండవ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో 31, ప్రకాశం జిల్లాలో రెండు పరీక్ష కేంద్రాలలో పరీక్షలు జరుగుతున్నాయి. యూనివర్సిటీ పీజీ, ప్రొఫెషనల్ కోర్సుల పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య ఎం.సుబ్బారావు మంగళవారం యూనివర్సిటీ పరీక్షా కేంద్రంలో పరీక్షల నిర్వహణను పరిశీలించారు.

'నూటా' ఎన్నికల నోటిఫికేషన్ రద్దు



ఏఎన్‌యూ: నూటా (ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అధ్యాపక సంఘం) ఎన్నికల నోటిఫికేషన్ రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని ఆచార్య కె.సుమంత్ కుమార్, ఆచార్య ఎం.జగదీష్ నాయక్ తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు నూటా ఎన్నికల నోటిఫికేషన్ రద్దు చేయాలని కోరుతూ ఎన్నికల అధికారి ఆచార్య ఎస్.మురళీమోహన్‌కు మంగళవారం వారిరువురూ వినతిపత్రం సమర్పించారు. ఎన్నికల నోటిఫికేషన్, ఎన్నికల ప్రక్రియలోని లోపాలపై తాము హైకోర్టును ఆశ్రయించామని తమ పిటీషన్‌పై మంగళవారం వాదనలు విన్న హైకోర్టు న్యాయమూర్తులు నూటా ఎన్నికల కోసం ఈనెల 1వ తేదీన జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.

10 మండలాల్లో తేలికపాటి వర్షం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో 10 మండలాల్లో తేలికపాటి వర్షం పడింది. సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు అత్యధికంగా తుళ్ళూరు మండలంలో 8.2 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా మేడికొండూరు మండలంలో 0.8 మి.మీ వర్షం పడింది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. మంగళగిరి మండలంలో 6.4 మి.మీ., పెదనందిపాడు 5.8, తాడేపల్లి 5.6, గుంటూరు పశ్చిమ 2, దుగ్గిరాల 1.4, గుంటూరు తూర్పు 1.2, పొన్నూరు 1.2, కాకుమాను మండలంలో 1 మి.మీ చొప్పున వర్షం పడింది.



పెదకాకాని సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న రాజ్యసభ సభ్యులు అయోధ్య రామిరెడ్డి, పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ



వైఎస్సార్ జయంతి సందర్భంగా గుంటూరు 57వ డివిజన్‌లో పేద మహిళలకు చీరెలు పంపిణీ చేస్తున్న పార్టీ నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా



నూతక్కి గ్రామంలో మహానేత నిలువెత్తు చిత్రపటానికి పూలుజల్లి నివాళులర్పిస్తున్న దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు

మహానేతకు జన నీరాజనం



నగరంపాలెం సెంటర్‌లో మహానేత విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న మోదుగుల వేణుగోపాలరెడ్డి

- వాడవాడలా వైఎస్సార్‌కు ఘననివాళులు
- విగ్రహాలకు పూలమాలలు, రక్తదాన శిబిరాలు, అన్నదానాలు
- రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ
- పాల్గొన్న మాజీ మంత్రులు, పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు గుంటూరు జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల పుట్టినరోజు వేడుకలు జరిగాయి. ప్రతిచోటా వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్ రాజశేఖరరెడ్డి జనరంజక పాలనను జనం గుర్తుకు తెచ్చుకున్నారు.

- దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, వైఎస్సార్ అంటే నచ్చని ప్రభుత్వం వచ్చినా కూడా వాటిని పక్కన పట్టలేనంత దూరదృష్టిలో రూపొందించి, అమలు చేశారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు కీర్తించారు. మహానేత వైఎస్సార్ జయంతి సందర్భంగా మంగళవారం బృందావన్‌గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ వైఎస్సార్ అంటే ఒక వ్యక్తి కాదని.. ఒక ఎమోషన్ అని చెప్పారు. వైఎస్సార్ భౌతికంగా దూరమై 16 సంవత్సరాలైనా ప్రజల గుండెల్లో ఆయన బతికే ఉన్నారన్నారు. 2029లో తిరిగి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎంని చేసుకోవటం ద్వారానే వైఎస్సార్ ఆశయాలను ముందుకు తీసుకుని వెళ్లగలమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, పార్టీ నేతలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్లు, జిల్లా, నగర కమిటీ నేతలు తదితరులు పాల్గొన్నారు. కొరిటెపాడులోని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహనికి పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, పార్టీ గుంటూరు, పల్నాడు జిల్లాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నగరంపాలెం, పట్టాభిపురం స్వామి థియేటర్, స్తంభాల గరువు, జిల్లా కోర్టు వద్ద వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్తంభాలగరువు వద్ద భారీ అన్నదానం నిర్వహించారు.
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా ఆధ్వర్యంలో గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని కొత్తపేట, నెహ్రూనగర్, మంగళదాస్‌నగర్, పాతగుంటూరు, నందివెలుగురోడ్డు, పొన్నూరు రోడ్డు, సంగడిగుంట, ఐపీడీకాలనీ, లాలాపేట, నల్లచెరువు, ఏటుకూరురోడ్డు, శ్రీనగర్, రైలుపేట, కాకానిరోడ్డుతో పాటు పలు ప్రాంతాల్లో వైఎస్సార్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు సేవా కార్యక్రమాలు చేపట్టి, వృద్ధులు, దివ్యాంగులకు పండ్లు పంపిణీ చేశారు. అనేక ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు.
- ప్రత్తిపాడు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. ప్రత్తిపాడులోని వైఎస్ కాంస్య విగ్రహానికి బలసాని పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ఇందిరాగాంధీ బొమ్మ సెంటరులోని దివంగత వైఎస్సార్ కాంస్య విగ్రహం వద్ద వైఎస్సార్ జన్మదిన కేక్‌ను కట్ చేశారు. తదనంతరం శాలివాహన సెంటరు, చిన్నపల్లె, రజక రామాలయం వద్దనున్న వైఎస్సార్ విగ్రహాలకు, ప్రత్తిపాడు మండల పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి బలసాని కిరణ్ స్థానిక పార్టీ నేతలతో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. మండల పార్టీ కన్వీనర్ చల్లా హనుమంత్ యాదవ్, అనుబంధ విభాగాల అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.
- తెనాలిలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. కొల్లిపర మండలం మున్నంగి గ్రామంలో నాలుగు రోడ్ల కూడలిలోని వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే శివకుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి, పేద వృద్ధులకు చీరలు, పంచలు పంపిణీ చేశారు. శివలూరు గ్రామంలో ప్రధాన కూడలిలో వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే శివకుమార్ పూలమాల వేసి నివాళులర్పించి పాలాభిషేకం నిర్వహించారు. పార్టీ కొల్లిపర మండల అధ్యక్షుడు కళ్ళం వెంకటప్పారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.
- మంగళగిరిలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డిలు పాల్గొని వైఎస్సార్ విగ్రహాల వద్ద ఘన నివాళులర్పించారు. మంగళగిరి, తాడేపల్లి, పట్టణ రూరల్ కన్వీనర్లు ఆకురాతి రాజేష్, బుర్రముక్క వేణుగోపాలస్వామిరెడ్డి, నాలి వెంకటకృష్ణ, తాడిబోయిన శివగోపయ్య, పట్టణ మహిళ అధ్యక్షురాలు సంకె సునీత తదితరులు పాల్గొన్నారు. నూతక్కిలో రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ప్రారంభించారు. తాడేపల్లి పట్టణ మహిళా అధ్యక్షురాలు పార్టీ నాయకులు గుడ్‌షెపర్డ్ కాన్వెంట్‌లో పండ్లు పంపిణీ చేశారు.చిట్టిమళ్ల స్నేహసంధ్య, చిట్టిమళ్ల సుబ్బారావు, దర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని క్రిస్టియన్‌పేట, కెఎల్‌రావు కాలనీ, మహానాడు, సీతానగరం, సులకపేట తదితర ప్రాంతాల్లో మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతివేడుకలను నిర్వహించారు.
- లాం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నియో జకవర్గ ఇన్‌చార్జి వనమా బాలవజ్రబాబు పాల్గొని డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు చీరలు పంపిణీ చేశారు. తాడికొండ, తుళ్లూరు గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాలకు నివాళులర్పించారు. రాయపూడి గ్రామంలో అన్నదానం కార్యక్రమం ప్రారంభించారు. ఫిరంగిపురం సొలసబస్టాండు సెంటర్లో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకొని మంగళవారం విగ్రహానికి పూలమాలవేసి కేక్‌ను కట్ చేశారు. అదేవిధంగా మండలంలోని 113.తాళ్లూరు, వేమవరం, రేపూడి, హౌస్‌గణేష్, శిరంగిపాలెం, యర్రగుంట్లపాడు, తక్కెళ్లపాడు, నుదురుపాడు, మేరికపూడి, పొనుగుపాడు, మునగపాడు, బేతపూడి, అల్లంవారిపాలెం గ్రామాల్లోని డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి స్వీట్లు పంచిపెట్టారు.

- వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో డాక్టర్ వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పల్లెల్లో మహానేత వైఎస్సార్ విగ్రహాలకు క్షీరాభిషేకాలు చేశారు. కేకులు కట్ చేసి, మహానేత విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు



గుంటూరు సూర్య హోటల్ సెంటర్‌లో కేక్ కట్ చేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం తదితరులు

జిల్లా కోర్టు న్యాయవాదుల ఆధ్వర్యంలో

దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర రెడ్డి జయంతి వేడుకలు మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొని వైఎస్సార్ చిత్ర పటానికి ఘనంగా నివాళులర్పించారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, నేతలు మోదుగుల వేణుగోపాల రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నిమ్మకాయల, స్టేట్ లీగల్ సెల్ కోర్ కమిటీ సభ్యుడు పోలూరి వెంకటరెడ్డి, జిల్లా లీగల్ సెల్ ప్రెసిడెంట్ సీడీ భగవాన్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.



పుల్లడిగుంటలో కేక్ కట్ చేసి, ప్రజలకు మిఠాయిలు పంచిపెడుతున్న ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్, పార్టీ నేతలు



కొల్లిపర మండలం మున్నంగిలో వృద్ధులకు చీరెలు, పంచెలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



తాడికొండ మండలం లాంలో పేదలకు చీరెలు, పండ్లు పంపిణీ చేస్తున్న పార్లమెంటు పరిశీలకులు మోదుగుల వేణుగోపాల రెడ్డి, సమన్వయకర్త బాల వజ్రబాబు

ఆటవిక ఆలోచనలతోనే దాడులు

- రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి
- పొన్నూరులో వైఎస్సార్ సీపీ నేత నాగమల్లేశ్వరరావుపై దాడి చేసిన టీడీపీ గూండాలపై కేసు నమోదు చేయాలి
- ప్రేరేపించిన ఎమ్మెల్యే నరేంద్రపై కూడా కేసు కట్టాలి
- వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి డిమాండ్



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, చిత్రంలో వైవీ సుబ్బారెడ్డి, అంబటి రాంబాబు, అంబటి మురళీకృష్ణ, ఏసురత్నం, బాల వజ్రబాబు, నూరిఫాతిమా

నగరంపాలెం (గుంటూరు వెస్ట్): పొన్నూరు మండలం మన్నవ సర్పంచి, వైఎస్సార్ సీపీ నేత బొనిగల నాగమల్లేశ్వరరావుపై టీడీపీ గూండాలు జరిపిన హింసాత్మక దాడి కేసులో నిందితులను న్యాయపద్ధతిలో అదుపులోకి తీసుకుని తగిన శిక్షపడేలా కూటమి ప్రభుత్వం పని చేయాలని రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి డిమాండ్ చేశారు. టీడీపీ గూండాల దాడిలో తీవ్రంగా గాయపడి గుంటూరు నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నాగమల్లేశ్వరరావును పరామర్శించేందుకు వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి, రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి మంగళవారం ఇక్కడకు విచ్చేశారు. వీరితోపాటు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మాజీ మంత్రి అంబటి రాంబాబు, పార్టీ ఎన్టీఆర్ జిల్లా పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసు రత్నం, నియోజక వర్గాల సమన్వయకర్తలు అంబటి మురళీకృష్ణ, నూరిఫాతిమా, వనమా బాలవజ్రబాబు ఉన్నారు. వీరంతా బాధితుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. నాగమల్లేశ్వరరావు ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులను కోరారు.

అండగా ఉంటున్నారనే అక్కసుతోనే ..

ఎంపీ అయోధ్య రామిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ తరపున ప్రజలకు అండగా ఉంటున్నారనే అక్కసుతో నాగమల్లేశ్వరరావుపై టీడీపీ గూండాలు విచక్షణ రహితంగా దాడికి తెగబడ్డారని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీలో ప్రజాసేవ చేసే వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని టీడీపీ నేతలు ఆటవిక దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే పొన్నూరు నియోజకవర్గంలో ఆటవిక ఆలోచనలతో దాడులకు రూపకల్పన చేసినట్లు తెలుస్తోందన్నారు. ఆయనపై దాడి చేసిన విధానాన్ని సీసీటీవీ పుటేజీల్లో చూస్తే చాలా దారుణంగా ఉందన్నారు. ఇటువంటి ఘటనలను ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు.

స్థానిక ఎమ్మెల్యే ఆదేశాల మేరకే దాడి

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కో–ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ టీడీపీ నేత, స్థానిక ఎమ్మెల్యే ఇచ్చిన ఆదేశాల మేరకే నాగమల్లేశ్వరరావుపై పాశవికంగా దాడికి తెగబడినట్టు తెలుస్తుందన్నారు. నాగమల్లేశ్వరరావుపై దాడికి పాల్పడిన నిందితులపై కేసు నమోదు చేయాలని, అదే విధంగా ప్రేరేపించిన ఎమ్మెల్యేపై కూడా కేసు నమోదు చేయాలని వైఎస్సార్ సీపీ నుంచి డిమాండ్ చేస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను కాపాడుకునేందుకు వైఎస్ జగన్ నేతృత్వంలో అండగా ఉంటామని చెప్పారు. శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఇంటిపై కూడా దాడి చేశారన్నారు. మా పార్టీ అధినేత వైఎస్ జగన్‌ను భూస్థాపితం చేయాలని స్వాక్షాత్తూ సీఎం చంద్రబాబు బహిరంగంగా వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. దీనిపై పోరాటం చేస్తామని, ప్రజల పక్షాన అండగా ఉంటామని చెప్పారు.

మహిళా పోలీసుల బదిలీల్లో అవస్థలు

- తమకు న్యాయం చేయాలంటూ ఎస్పీ కార్యాలయం ఎదుట నిరసన


గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న మహిళా పోలీసులు

నగరంపాలెం: గ్రామ, వార్డు సచివాలయాల బదిలీల ప్రక్రియ గందరగోళంగా మారిందని మహిళా పోలీసులు వాపోయారు. బదిలీల దరఖాస్తుల్లో ఐదు ఆప్షన్లకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ వందల కిలో మీటర్ల దూరం బదిలీలు చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయం(డీపీఓ) ఎదుట మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. తమకు న్యాయం కావాలంటూ నినదించారు. గత నెల 28న గ్రామ, వార్డు సచివాలయాల్లో విధులు నిర్వర్తించే మహిళా పోలీసుల బదిలీల ప్రక్రియ మొదలైంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలోని మహిళా పోలీసులు ఆయా డీపీఓల్లో దరఖాస్తులు చేసుకున్నారు. రెండు రోజుల క్రితం బదిలీల ప్రక్రియ ముగిసి, పోస్టింగ్‌లు కల్పించారు. ఒక్కసారిగా మహిళా పోలీసుల్లో ఆందోళన మొదలైంది. గుంటూరు అర్బన్ జిల్లాలోని వార్డు సచివాలయాల్లో విధులు నిర్వర్తించే వారికి పల్నాడు, బాపట్ల జిల్లాలను కేటాయించారని వాపోయారు. దరఖాస్తులు చేసినా పట్టించుకోలేదన్నారు.

112 కి.మీ. దూరం బదిలీ



గుంటూరు అర్బన్‌లోని ఓ సచివాలయంలో మహిళా పోలీస్‌గా విధులు నిర్వహిస్తున్నా. పల్నాడు జిల్లా మాచర్ల మున్సిపల్ పరిధిలోని సచివాలయానికి బదిలీ చేశారు. గుంటూరు నుంచి కనీసం 112 కిలో మీటర్ల దూరం ఉంది. భర్త ఆర్మీలో ఉన్నారని, ఇద్దరు ఆడపిల్లలతో అక్కడకు వెళ్లాలంటే కష్టంగా ఉంటుంది. న్యాయం చేయగలరు.

– ఉషారాణి యడవల్లి, గుంటూరు అర్బన్.

ఆప్షన్ కూడా చూడలేదు



గుంటూరు అర్బన్ పరిధిలోని అడవితక్కెళ్ళపాడు సచివాలయం నుంచి మేడికొండూరు రూరల్‌కు బదిలీ చేశారు. దరఖాస్తులో ఏడు నెలల బాబు ఉన్నాడని విన్నవించాను. పట్టించుకోలేదు. చాలామంది ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యా సంవత్సరం మొదలై ఫీజులు చెల్లించిన తర్వాత సుదూర ప్రాంతాలకు బదిలీ తగదు.

– వై.నివేదిక, గుంటూరు అర్బన్.

పట్టుకోండి చూద్దాం

- పోలీసులకే సవాల్ విసురుతున్న మన్నవ సర్పంచిపై హత్యాయత్నం కేసు
- నిందితులకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వం
- జిల్లా టీడీపీ కార్యాలయంలో నిందితుల ప్రెస్‌మీట్
- ప్రభుత్వ తీరుపై వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మండిపాటు


మంగళవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న నిందితులు బాబూరావు, చింపిరయ్య

సాక్షి టాస్క్‌ఫోర్స్: ప్రభుత్వం మనది.. అధికారం మనది.. ఏం చేసినా అడిగే వారుండరు.. ఎవరైనా అడిగితే మన బాస్ చూసుకుంటారులే.. ఇదీ ప్రస్తుతం టీడీపీ నాయకుల ఆలోచన తీరు. ఎంతటి ఘోరం చేసినా, నేరం చేసినా మనల్నెవ్వర్రా ఆపేది అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు పొన్నూరు టీడీపీ నాయకులు. హత్యాయత్నం కేసులో ముద్దాయిలుగా ఉన్న ఇద్దరు టీడీపీ నాయకులు ఏకంగా జిల్లా టీడీపీ కార్యాలయంలో మంగళవారం ప్రెస్ మీట్ పెట్టడం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇంత జరుగుతున్నా పోలీసులు చూసీచూడనట్లుగా ఉండడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కూటమి పాలనలో ఎంతటి నేరం చేసిన వారైనా.. హత్యాయత్నం కేసులో ఉన్న ఏ4, ఏ5 నిందితులు దర్జాగా బయట తిరుగుతున్నా పట్టించుకోకపోవడం పట్ల పోలీసులు టీడీపీకి కొమ్ముకాస్తున్నట్లు స్పష్టమవుతోందని వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆరోపించారు. ఏకంగా టీడీపీ కార్యాలయంలోనే పార్టీ ప్రతినిధులుగా నిందితులు ప్రెస్ మీట్ పెట్టి మాట్లాడటం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. చిన్న చిన్న నేరాల్లో ఉన్న వారి కోసం వెతుకులాడే పోలీసులు అత్యంత ఘోరంగా దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన వారిపట్ల ఉదాసీన వైఖరి ప్రదర్శించడాన్ని తప్పుబట్టారు. ఈ నెల 3వ తేదీన గుంటూరు జిల్లా పొన్నూరు మండలంలోని మన్నవ దళిత సర్పంచ్ బొనిగల నాగమల్లేశ్వరరావుపై జరిగిన హత్యాయత్నం కేసులో ఏ4, ఏ5లుగా ఉన్న బండ్లమూడి చింపిరయ్య, బండ్లమూడి బాబూరావులను టీడీపీ జిల్లా కార్యాలయంలో కూర్చొపెట్టి ప్రెస్ మీట్ పెట్టించడం చూస్తుంటే.... కూటమి ప్రభుత్వం ఏ విధంగా వారికి కొమ్ముకాస్తుందో అర్థమవుతోందని అన్నారు. ఈ రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం ఏ విధంగా అమలౌతుందో చెప్పడానికి, ఈ ప్రెస్ మీట్ ఒక ఉదాహరణ అని దుయ్యబట్టారు. ఈ జిల్లాలో అసలు పోలీస్ వ్యవస్థ ఉందా అని ప్రశ్నించారు. పోలీసులంటే నిందితులకు లెక్క లేదా అని నిలదీశారు. హత్యాయత్నం కేసులో పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రను ఏ1 గా చేర్చాలని, రెండు రోజుల క్రితం వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్పీని కలిసి ఇచ్చిన ఫిర్యాదు చేసినప్పటికీ ఏ4,ఏ5 నిందితులు వచ్చి ప్రెస్ మీట్ పెట్టి, తమ ఎమ్మెల్యేకు ఈ కేసుతో సంబంధం లేదని చెప్పడం పలు అనుమానాలకు తావిస్తోందని అన్నారు. నిందితులు దర్జాగా తిరుగుతూ, మా టార్గెట్‌లో ఇంకా కొంతమంది ఉన్నారని, వారిని చంపేస్తామని హెచ్చరించడం చూస్తుంటే ప్రభుత్వం ఏ స్థాయిలో అండగా ఉందో తెలుస్తుందని మురళీకృష్ణ అన్నారు. నాగమల్లేశ్వరరావుపై కట్టుకథలు అల్లి, అతని క్యారెక్టర్ దిగజార్చాలని చూస్తున్నారని ఆరోపించారు. ఎవరి చరిత్ర ఏంటో ప్రజలకు తెలుసని అన్నారు. బండ్లమూడి బాబూరావు దౌర్జన్యాలు,అక్రమాలు ఆధారాలతో త్వరలో తెలియజేస్తామని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బాధితులకు న్యాయం చేస్తామని మురళీకృష్ణ పేర్కొన్నారు.


Serial No : 4
a) Name : Bandlamudi Chimpiraiah
b) Father's /Husband's Name : Baburao
d) Caste : e) Gender :
g) Address House No :
City/District : Guntur
h) Phone(Off) : 0
i) Email :
Serial No : 5
a) Name : Bandlamudi Baburao
b) Father's /Husband's Name : Paddaiah
d) Caste : e) Gender :
g) Address House No :

చింపిరయ్య, బాబూరావులను ఏ4, ఏ5 గా పేర్కొంటూ ఎఫ్ఐఆర్ కాపీ

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు



గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 1,000 గరిష్ఠం : రూ. 1,600

మోడల్ ధర రూ. 1,300

మిర్చి యార్డు సమాచారం
(మంగళవారం ధరలు)



వచ్చిన బస్తాలు	47,553
అమ్మకాలు	45,606
నిల్వ	8,406

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-12,700
నంబరు-5	10,000-13,200
273	10,000-12,500
341	10,000-13,400

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-12,800
నంబరు-5	10,000-13,200
273	9,800-12,400
341	10,000-13,500
4884	10,000-12,600

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 13,500
బాడిగ-355	10,000 - 12,700
దేవనూరు డీలక్స్	10,000 - 12,400
ఆర్మూర్	9,600 - 11,000
తాలుకాయలు	5,000 - 6,700

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000-13,300
బాడిగ - 355	10,000-12,500
దేవనూరు డీలక్స్	10,000-12,300
తాలు	5,200 - 7,000

-కొరిటిపాడు (గుంటూరు)

ఉద్యోగులు అక్రమాలకు పాల్పడితే చర్యలు


ప్రజావేదికలో డ్వామా అధికారులు

చీరాల టౌన్: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఉపాధి కల్పించి వలసలు నిర్మూలించేందుకు ప్రవేశపెట్టిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో సిబ్బంది, ఉద్యోగులు అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని బాపట్ల జిల్లా డ్వామా పీడీ ఎ.వి.విజయలక్ష్మి హెచ్చరించారు. మంగళవారం చీరాల మండల పరిషత్ కార్యాలయంలో 2024 ఏప్రిల్ నుంచి మార్చి 2025 వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. సామాజిక తనిఖీ బృందం చీరాల మండలంలోని గ్రామ పంచాయతీల్లో చేపట్టిన పనులపై తనిఖీ చేపట్టారు. మండలంలో చేపట్టిన 1243 పనులు, ఖర్చులు రూ.9 కోట్లు, పంచాయతీరాజ్ నిధులు రూ.1.82 కోట్లు, ఎన్ఆర్ఈజీఎస్ రూ.6.95 కోట్లతో ఉపాధి పనులు చేశారు. పంట కాలువలు, పూడికతీత పనులు, గోకులం షెడ్లు 10 నిర్మాణాలు, ఉపాధి కూలీలకు చెల్లించిన నగదు, వసతులు, మెటీరియల్ సరఫరా, మొక్కల సంరక్షణ తదితర పనులపై సామాజిక తనిఖీ బృందం పంచాయతీల వారిగా చేసిన పనులను వివరించారు. మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో చేసిన పనులు, చెల్లింపుల వివరాలను, కూలీలు వివరాలను సిబ్బంది అధికారులకు వివరించారు.

నేడు సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

లక్ష్మీపురం: కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తీవ్రంగా ఖండిస్తూ బుధవారం దేశవ్యాప్తంగా జరగబోయే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్ కుమార్ తెలిపారు. మంగళవారం గుంటూరులో మీడియాతో మాట్లాడుతూ.. బుధవారం ఉదయం 9 గంటలకు గుంటూరులో వెంకటేశ్వర విజ్ఞాన మందిరం వద్ద నుంచి భారీ ర్యాలీ ప్రారంభం అవుతుందని చెప్పారు. బీఆర్ స్టేడియం వరకు సాగుతుందని వివరించారు. సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఏఐటీయూసీ గుంటూరు నగర గౌరవ అధ్యక్షుడు జి.సురేష్ బాబు పిలుపునిచ్చారు. సమ్మెకు గుంటూరు నగర ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మంగ శ్రీనివాస్, ఆకేటీ అరుణ్‌కుమార్‌లు తెలిపారు.

సమావేశంలో కొరవడిన సమన్వయం

మంత్రి దుర్గేష్ అధ్యక్షతన డీఆర్సీ సమావేశం



గుంటూరు వెస్ట్: జిల్లాను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా సమీక్షా సమావేశం జరిగింది. జిల్లా సమీక్షా సమావేశంలో సమన్వయం లేకుండా పోయింది. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులకు, అధికారులకు మధ్య ఎక్కడా సమన్వయం లేకపోవడం గమనార్హం. సమావేశంలో తల్లికి వందనంపై చర్చ జరిగేటప్పుడు పూర్తి వివరాలు డీఈఓ రేణుక వెల్లడించలేకపోయారు. దీంతో శాసనసభ్యుడు ధూళిపాళ్ళ నరేంద్ర, తెనాలి శ్రావణ్ కుమార్‌లు నిలదీశారు. కొందరికి రూ.13 వేలు, మరికొందరికి రూ.10 వేలు ఎందుకు పడుతున్నాయని శాసన సభ్యులు ప్రశ్నించగా అధికారుల వద్ద సమాధానం కరువైంది. గ్రామాల్లో తిరుగుతున్నప్పుడు ప్రజలు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేకపోతున్నామని వెల్లడించారు. అర్హత ఉన్నప్పటికీ ఎందుకు నగదు జమ చేయలేదని నిలదీశారు. కలెక్టర్ సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. దీంతోపాటు సీసీఆర్సీ కార్డులతోపాటు కౌలు రైతులకు రుణాలు లక్ష్యాల మేరకు ఎందుకివ్వలేదని ప్రశ్నించినప్పుడు కూడా పర్యవేక్షిస్తున్నామని అధికారులు దాటవేత ధోరణిలో బదులిచ్చారు. ఇక పీ4 విషయానికి వస్తే మరీ దారుణంగా వ్యవహరించారు. జిల్లాలో గుంటూరు తూర్పు నియోజకవర్గానికి 17,050, పశ్చిమకు 14,757, మంగళగిరికి 9,968, పొన్నూరుకు 9,632, ప్రత్తిపాడుకు 6,700, తెనాలికి 11,173 మందిని ఆదుకోవాలని లక్ష్యాలుగా నిర్ణయిస్తే ఒక్కరు కూడా ఎంత మందికి న్యాయం చేవామో చెప్పలేదు. ఇంకా పూర్తి స్థాయి మార్గదర్శకాలు రూపొందించలేదని తెలిసింది. ఈ సమావేశానికి కూడా మంగళగిరి శాసన సభ్యులు, మంత్రి నారా లోకేష్ హాజరు కాలేదు. ఆయనతోపాటు ప్రత్తిపాడు శాసనసభ్యుడు బూర్ల రామాంజనేయులు, తెనాలి శాసన సభ్యుడైన మంత్రి నాదెండ్ల మనోహర్‌లు రాలేదు.

పెన్షన్ భిక్ష కాదు... హక్కు

లక్ష్మీపురం: గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఏపీఎస్ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గుంటూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. వృద్ధాప్య పెన్షన్, తెల్ల రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ వంటి పథకాలు ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్‌కి కూడా వర్తింపజేయాలని జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ అన్నారు. జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నాలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పని గంటలు పెంచుతూ చట్టం తీసుకొచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను ఖండించారు. బుధవారం జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. యూనియన్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ కె.గంగాధర్ రావు మాట్లాడుతూ ఎన్నో సార్లు కోరినా తమ సమస్యలు పరిష్కారం కానందున ధర్నా చేశామని చెప్పారు. సీఐటీయూ నాయకులు, నికల్సన్, పి. శేషగిరిరావు, బి.నాగేశ్వరరావు, నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యం కేసులో పది మంది ఆచూకీ గుర్తింపు



లక్ష్మీపురం: ఈ నెల 2వ తేదీన కొబాల్డ్‌పేటలో ముగ్గురు మహిళలు, ఏడుగురు చిన్నారులు అదృశ్యం అయిన కేసును పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు ఛేదించారు. వారిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. పట్టాభిపురం సీఐ తెలిపిన వివరాల ప్రకారం... కొబాల్డ్‌పేట 6వ లైనులో నివాసం ఉండే సయ్యద్ సందానీకి, అతని భార్య కరీమూన్‌కు కొంత కాలంగా చిన్న గొడవలు జరుగుతున్నాయి. అదే భవనంలో పై పోర్షన్‌లో నివాసం ఉండే షేక్ చిన్న బాజీకి, ఆమె భార్య రజియాకు కూడా మనస్పర్థలు ఉన్నాయి రజియా చెల్లెలు సైదాబీకూడా తన భర్తతో గొడవల కారణంగా వచ్చి వీరి వద్దనే తన కుమార్తెతో ఉంటోంది. ఎక్కడికైనా వెళ్లి పని చేసుకోవాలని నిర్ణయించుకుని కరీమూన్ తన ముగ్గురు మగ పిల్లలను, రజియా తన ముగ్గురు పిల్లలను, సైదాబీ తన కుమార్తెను వెంట బెట్టుకుని వెళ్లిపోయారు. కుటుంబసభ్యులు పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు ప్రారంభించారు. హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించారు. వారిని కౌన్సెలింగ్ తర్వాత కుటుంబసభ్యులకు అప్పగించారు.

గంజాయి స్వాధీనం

ముగ్గురు నిందితులు అరెస్టు


నిందితుల అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

నెహ్రూనగర్: అడవి తక్కెళ్లపాడు టిడ్కో గృహాల వద్ద గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను గుంటూరు 2 ఎక్సైజ్ శాఖ అధికారులు అరెస్టు చేశారు. ఎక్సైజ్ సీఐ ఎం యశోధర దేవి తెలిపిన వివరాల మేరకు.. అడవి తక్కెళ్లపాడుకు వెళ్లే రోడ్డులో చెరువు కట్ట వద్ద ఆటో నిలిపి గంజాయి విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న గుంటూరు వారితోటకు చెందిన షేక్ జాఫర్ అహ్మద్, కాకుమానువారితోటకు చెందిన పెట్లూరి సాహిద్, బొంగరాలబీడుకు చెందిన దాసరి సుమంత్‌లను అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి 456 గ్రాముల గంజాయిని, ఒక ఆటో, 3 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. నగరానికి చెందిన ఈశ్వర్ అనే వ్యక్తి వద్ద నుంచి వీరు గంజాయి కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. అతని కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు సీహెచ్ మాధవి, పీఆర్‌కె మూర్తి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగిస్తున్న వ్యక్తులకు కౌన్సెలింగ్

నగర శివారు ప్రాంతాల్లో గంజాయి వినియోగిస్తున్న వ్యక్తులను గుంటూరు 2 ఎక్సైజ్ స్టేషన్‌కు అధికారులు పిలిపించారు. వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి పిలిపించి మరీ సీఐ యశోధరదేవి కౌన్సెలింగ్ నిర్వహించారు. గంజాయి వినియోగించినా, అమ్మినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్థల ఆక్రమణపై విచారణకు హాజరైన కిలారి


కార్పొరేషన్ కార్యాలయంలో నిరసన తెలుపుతున్న దళిత, బహుజన సంఘాల నేతలు

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): జీటీ రోడ్డు (మిర్చి యార్డు ప్రాంతం)లో ఉన్న 1,548 గజాల స్థలాన్ని మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య (జనసేన) ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నారని గుంటూరు నగరానికి చెందిన రిటైర్డ్ తహసీల్దార్ గుమ్మడి రాజారావు భార్య గుమ్మడి భారతి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో రోశయ్య, గుమ్మడి భారతిలు మంగళవారం కమిషనర్ సమక్షంలో విచారణకు హాజరయ్యారు. దీనిపై భారతి తెలిపిన వివరాల ప్రకారం .. 1,548 గజాల స్థలాన్ని 1980లో ఓ వ్యక్తి నుంచి వద్ద నుంచి గుమ్మడి భారతి భర్త రాజారావుతో పాటు మరో ఇద్దరు కలిసి స్వాధీన అగ్రిమెంట్ కింద కొనుగోలు చేశారు. అయితే స్థలం అమ్మిన వ్యక్తి 1981లో స్థలాన్ని అప్పు కింద అటాచ్ చేయాలని కోర్టును ఆశ్రయించాడు. కోర్టులో వాదనలు జరుగుతున్న క్రమంలోనే స్థలం అమ్మిన వ్యక్తి మాజీ ఎమ్మెల్యే తాలుకా వ్యక్తులకు జీపీఏ చేశారు. రాజారావుతో కలిసి ఉన్న ఇద్దరు వ్యక్తులు కూడా మాజీ ఎమ్మెల్యేకు మద్దతుగా నిలిచారు. దీంతో 2015లో ఆ స్థలం ముందు భాగంలో ఒక థియేటర్, వెనుక భాగంలో అపార్ట్‌మెంట్ నిర్మాణం చేపట్టారు. మధ్యలో ఉన్న రాజారావు స్థలాన్ని అలాగే ఖాళీగా వదిలేశారు. సదరు స్థలాన్ని రాసివ్వాలని పలుమార్లు బెదిరించినప్పటికీ రాజారావు స్పందించకపోవడంతో కారుతో ఢీకొట్టే యత్నం చేశారని ఆమె ఆరోపించారు. రాజారావు గత సంవత్సరం మృతి చెందడంతో తమ స్థలంలో కూడా నిర్మాణం ప్రారంభించారని భారతి తెలిపారు. గొడవను కోర్టులో తేల్చుకోవాలని కమిషనర్ పులి శ్రీనివాసులు సూచించారని ఆమె పేర్కొన్నారు.

రోశయ్యను అరెస్టు చేయాలి

అధికారం అడ్డుపెట్టుకుని దళితుల స్థలాలను ఆక్రమిస్తున్న కిలారి రోశయ్యను వెంటనే అరెస్టు చేయాలని దళిత, బహుజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అక్రమాలకు పాల్పడిన కిలారి రోశయ్యను వెంటనే జనసేన పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని, తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన సంఘాల నాయకులు జీఆర్ భగత్ సింగ్, నల్లపు నీలాంబరం, చిన్నం డేవిడ్ విలియమ్స్, జూపూడి శ్రీనివాసరావు, బండ్లమూడి స్టాలిన్, తాటికొండ నరసింహారావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

పికిల్ బాల్ జిల్లా కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక


నూతన కార్యవర్గం

గుంటూరు వెస్ట్ (క్రీడలు): పికిల్ బాల్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా నూతన కార్యవర్గాన్ని వీవీపీ హెల్త్ క్లబ్‌లో ఎన్నుకున్నారు. ఎన్నికలకు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ నుంచి పి.నరసింహారెడ్డి, ఏపీ పీపుల్ బాల్ సంఘం కార్యదర్శి ఎన్.శ్రీధర్, ఒలింపిక్ సంఘం నుంచి కె.వేణుగోపాల్‌తో పాటు న్యాయవాది చిగురుపాటి రవీంద్రనాథ్ హాజరయ్యారు. చీఫ్ ఇన్ ప్యాట్రన్‌గా టి.అరుణ్ కుమార్, చైర్మన్‌గా చుక్కపల్లి రాకేష్, గౌరవాధ్యక్షుడిగా టి.హరికిషన్ సాయి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ ఎం.శివకుమార్, ఉపాధ్యక్షులుగా సి.హెచ్.రవీంద్ర బాబు, ఎన్వీ కమలాకాంత్, ఎస్వీ రామకోటేశ్వరరావు, డాక్టర్ పి.వరుణ్, డాక్టర్ టి.హనుమంతరావు, ఎం.భరత్ కుమార్, కార్యదర్శిగా జీవీఎస్ ప్రసాద్, సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్ ఎం.కళ్యాణ చక్రవర్తి, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ ఫణీంద్ర, ఎన్ ఫణిరామ్, ఎస్కే మన్సూర్ వలి, ఎ.సుబ్బారావు, నిర్వహణ కార్యదర్శిగా కె.అరుణ్ కుమార్, కోశాధికారిగా కె.సుస్మితా చౌదరిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

క్లుప్తంగా

మాజీ మంత్రి అంబటికి పోలీసుల నోటీసులు

సత్తెనపల్లి: పోలీసుల విచారణకు హాజరు కావాలని వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు సత్తెనపల్లి రూరల్ పోలీసులు మంగళవారం నోటీసులు జారీ చేశారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గత నెల 18న పల్నాడు జిల్లా రెంటపాళ్ల పర్యటన సందర్భంగా పోలీసుల ఆంక్షలు ఉల్లంఘించారంటూ పలు సెక్షన్లతో విచారణకు హాజరు కావాలని కోరారు. నోటీసులు అందుకున్న మాజీ మంత్రి అంబటి రాంబాబు ఈనెల 11న సత్తెనపల్లి రూరల్ పోలీసులు ఎదుట విచారణకు హాజరు కానున్నారు.

మార్కెట్ షాపులు ఖాళీ చేయాలి

నెహ్రూనగర్: గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న డాక్టర్ కొల్లి శారద హోల్‌సేల్ మార్కెట్‌లోని షాపులను ఖాళీ చేయాలని లీజ్ దారులకు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు నోటీసులు జారీ చేశారు. మొత్తం 95 షాపులకు 25 సంవత్సరాలు అద్దె కాల పరిమితి తీరిపోయింది. తిరిగి షాపులను తమకే కేటాయించాలని లీజుదారులు హైకోర్టును ఆశ్రయించారు. కొన్ని సంవత్సరాలుగా కోర్టులో వివాదం నడుస్తూ వచ్చింది. దీనిపై సాక్షి దినపత్రికలో పలు కథనాలు ప్రచురితం అయ్యాయి. హైకోర్టు స్పీకింగ్ నోటీసులు జారీ చేసి స్వాధీనపరచుకోవాలని ఆదేశించింది. హైకోర్టు ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ రెవెన్యూ అధికారులు మంగళవారం లీజు దారులకు నోటీసులు జారీ చేశారు. ఏడు రోజుల్లోగా ఖాళీ చేయాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు.

కళాశాలలో సీట్ల భర్తీ

గుంటూరు ఎడ్యుకేషన్: పాత గుంటూరు నందివెలుగురోడ్డులోని ఏపీ రెసిడెన్షియల్ ఉర్దూ మైనార్టీ బాలుర జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్లలో చేరేందుకు అర్హులైన పేద ముస్లిం విద్యార్థులు ఈ నెల 31వ తేదీలోపు సంప్రదించాలని ప్రిన్సిపల్ పి. సాంబశివరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బైపీసీలో 20, సీఈసీలో 15 సీట్లలో ప్రవేశానికి బీసీ–ఈ, బీసీ–బీ కేటగిరీ విద్యార్థులు అర్హులని తెలిపారు.